క్లుప్తంగా

సీఎస్ఆర్ఎంఓ బాధ్యతల స్వీకరణ



సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లును కలిసిన సీఎస్ఆర్ఎంఓ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా డాక్టర్ బి.వి.సతీష్ కుమార్ సోమవారం ఆసుపత్రిలో బాధ్యతలు స్వీకరించారు.గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై కర్నూలు ఆసుపత్రికి వచ్చారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓగా డాక్టర్ వి.పద్మజ సైతం బాధ్యతలు తీసుకున్నారు. ఈమె అనంతపురం జీజీహెచ్ నుంచి కర్నూలుకు బదిలీపై వచ్చా రు. బాధ్యతలు తీసుకున్న అనంతరం వీరిద్ద రూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రికి సంబంధించి పలు విషయాలపై వారు చర్చించారు. సమన్వయంతో, సమష్టితో ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలని డాక్టర్ వెంకటేశ్వర్లు వారికి సూచించారు.

కర్నూలులో కర్ణాటక సీఎం



ఎయిర్‌పోర్టులో సిద్ధరామయ్యకు స్వాగతం పలుకుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

ఓర్వకల్లు/కర్నూలు సెంట్రల్: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆయన బెంగుళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి రాయచూర్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, డీఎస్పీ బాబుప్రసాద్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వని నేపథ్యంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.హుస్సేన్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం 11వ వార్డు ఎర్రబురుజు డీవైఎఫ్ఐ కమిటీ సమావేశాన్ని స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇచ్చి ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మణికుమార్, శంకర్‌లు ఎన్నికయ్యారు.

నిబంధనల మేరకు బదిలీలు చేపట్టాలి

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 7529 మంది ఎనర్జీ అసిస్టెంట్ల(గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌లు) బదిలీలు మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు పి.నాగరాజు డిమాండ్ చేశారు. మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు జరిగితే వీరందరు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని కోరుతూ విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామాల వారీగా ఎనర్జీ అసిస్టెంట్లను నియమించిందని, వీరందరు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలతో సంబంధం లేకుండా ఎనర్జీ అసిస్టెంట్ల బదిలీలు చేపట్టాలని కోరారు.

పోక్సో కేసు నమోదు

కోడుమూరు రూరల్: కోడుమూరులో మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా పసుపుతాడు కట్టిన యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ ఎర్రిస్వామి సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోడుమూరుకు చెందిన ఓ బాలికను ఓ యువకుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి బలవంతంగా పసుపుతాడు కట్టాడు. జరిగిన విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కోడుమూరు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎర్రిస్వామి యువకుడితో పాటు, యువకుడికి సహకరించిన మహిళ, మరో వ్యక్తిపై పోక్సో, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, కిడ్నాప్ కేసులను నమోదు చేశారు.

పీజీఆర్ఎస్‌కు 88 ఫిర్యాదులు

కర్నూలు: కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 88 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజయవాడకు వెళ్లడంతో సీఐలు శివశంకర్, చిరంజీవి పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఆందోళన
- సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ రోడ్డెక్కిన అంగన్‌వాడీలు
- ఇళ్ల పట్టాల కోసం జొహరాపురం వాసుల ధర్నా
- విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్ల కోసం తల్లిదండ్రుల ఆందోళన
- ఈనామ్ పేరుతో ఉన్న భూములను పట్టాగా మార్చాలని హొళగుంద రైతుల పట్టు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జొహరాపురం వాసులు



ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీలు



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వంపై ప్రజలు తిరగబడ్డారు. తమకు సమాధానం చెప్పాలని అధికారులను పట్టుబట్టారు. తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఫలితంగా ధర్నాలు, ఆందోళనలు, నిరసనలతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిపోయింది. వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అధ్యక్షతన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతిపై పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుల నినాదాలతో కలెక్టరేట్ హోరెత్తింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తమను అర్హులుగా గుర్తించాలని అంగన్‌వాడీలు, తాము వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని జొహరాపురం వాసులు, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య కోసం ప్రభుత్వం ఎంపిక చేసినా పిల్లలను చేర్చుకోకపోవడంపై ఆగ్రహంతో బాధిత తల్లిదండ్రులు, ఈనామ్ పేరుతో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ హొళగుంద మండల రైతులు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఈనామ్ పేరుతో ఉన్న భూములను పట్టాగా మార్చాలి

హొళగుంద మండలం నాగరకన్వి గ్రామంలో ఇనామ్ పేరుతో ఉన్న భూములను పట్టాగా మార్చాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతుల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .తమ భూములు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు చెప్పారు. ఫలితంగా ఖరీఫ్ పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇవ్వడం లేదని దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒక్కో రైతు భూమి ఒక్కో విధంగా ఇనామ్ అని, సర్వీసు ఇనామ్ అని చూపడడంతో ఇబ్బందిగా మారిందని, వాటిని తొలగించి పట్టాగా మార్చాలని కోరారు. రైతులు నాగిరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివమ్మ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)సీని ఉల్లంఘించి అడ్మిషన్లను నిరాకరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో సీటు మంజూరైనా యాజమాన్యాలు మాత్రం అడ్మిషన్లను నిరాకరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారికి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు కె.వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. తమ పిల్లలకు విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో సీటు వచ్చినా యాజమాన్యాలు చేర్చుకోవడం లేదన్నారు. ముందుగా ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కలుగజేసుకొని తమ పిల్లలకు అడ్మిషన్లను ఇప్పించాలని కోరారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నా పట్టాలు ఇవ్వరా?

కర్నూలు శివారులోని జొహరాపురంలో సర్వే నంబర్ 67/1, 781లలో పేదలు గుడిసెలు వేసుకొని 15 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నా వాటికి పట్టాలు ఎందుకు ఇవ్వడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రశ్నించారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో జొహరాపుంలో కేసీ కాల్వ పోరంబోకులో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని కాలం వెల్లదీస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, సి.నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

అంగన్‌వాడీలు, హెల్పర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్‌రాధాకృష్ణ డిమాండ్ చేశారు. అలాగే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని పట్టుబట్టారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. తమకు ఇచ్చే రూ.11,500 వేతనానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతుంటే మరో రెండు యాప్‌లను తీసుకురావడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సాయిబాబా, విజయ్, గురుశేఖర్, గోవర్ధనమ్మ, పద్మ, వరలక్ష్మీ, బాలదరగమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి ఒలింపిక్ జ్యోతి



ఒలింపిక్ డే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యప్రదర్శన

కర్నూలు (టౌన్): ఒలింపిక్స్ క్రీడలు ఇచ్చిన స్ఫూర్తితో భావితరాలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని కర్నూలు ఒలింపిక్ సంఘం చైర్మన్ మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వద్ద మాజీ మంత్రి కేఈ, పాతబస్తీ, బిర్లాగేట్, ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ కూడళి, చెన్నమ్మ సర్కిల్ నుంచి ఒలింపిక్ రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని తాము ఎంచుకున్న క్రీడల్లో రాణించాలన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి మాట్లాడుతూ.. ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, క్రీడా సంఘాల ప్రతినిధులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, వీధి దీపాల సమస్య పరిష్కరించండి



అదనపు కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీ మహిళలు

కర్నూలు (టౌన్): జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు నజియ ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పలువురు నగరవాసులు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులు తమ దృష్టికి వస్తే వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు లేవనెత్తిన సమస్యలు ఇవే..

- వడ్డగేరి, కేవీఆర్ గార్డెన్, బొంగుల బజార్ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు అబ్దుల్ సలామ్, మహమ్మద్ అహమ్మద్, మోహన్ ఫిర్యాదు చేశారు.
- సిద్ది వినాయక నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు నజీర్ బాషా, సుమ, లీల విన్నవించారు.
- జొహరాపురంలో పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు రంగస్వామి, ఈశ్వరయ్య, రాజేష్ విన్నవించారు.
- జీఓ నంబర్ 5ను సవరించాలని కోరుతూ సచివాలయాల ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

కర్నూలు (టౌన్): వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో రాజకీయ సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు రేపల్లె ప్రతాప్ అన్నారు. సోమవారం సచివాలయ ఉద్యోగులతో కలిసి నగర పాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు నేటివిటీ తొలగించి బదిలీలు చేపట్టాలన్నారు. అలాగే ఉద్యోగుల సీనియారిటీ జాబితాను వెంటనే ప్రకటించాలన్నారు. బదిలీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా ఎంచుకునే అవకాశాన్ని సచివాలయ ఉద్యోగులకు కల్పించాలన్నారు.

బాల సదన్‌ను తనిఖీ చేసిన న్యాయమూర్తి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడులో ఉన్న దామోదరం సంజీవయ్య బాల సదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సోమవారం తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో బాలల సంక్షేమం కొరకు, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీనీ ఏ ర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలియజే శారు. బాలసదన్‌లో పిల్లలకు అందిస్తున్న ఆహా రం, ఆరోగ్య, సంరక్షణ గురించి తనిఖీ చేశారు.

ఆస్పత్రిని సందర్శించిన న్యాయమూర్తి

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని పెంచికలపాడు విశ్వభారతి హాస్పిటల్‌ను సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని మానసిక దివ్యాంగుల విభాగాన్ని తనిఖీ చేసి వారితో మాట్లాడడంతో పాటు, వారికందుతున్న ఆహార, వైద్య సదుపాయాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మానసిక దివ్యాంగుల సంక్షేమానికై న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యూఎం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని న్యాయమూర్తి వారికి సూచించారు. హాస్పిటల్ డాక్టర్ మహేంద్రకుమార్, సైక్రియాటిస్ట్ శివశంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందితోనే ఎలక్ట్రిక్ బస్సులు నడపాలి

కర్నూలు(సెంట్రల్): రోడ్డు రవాణా సంస్థలోకి కొత్తగా వస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్లతోనే నడిపించాలని ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో ఫెడరేషన్ విస్తృత స్థాయి జిల్లా సమావేశాన్ని నాయకుడు శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 750 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థ ద్వారా నడపాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అయా బస్సుల్లో జిల్లాకు 50 కేటాయిస్తారని, వీటిని నడిపేందుకు 50 మంది ప్రైవేట్ వ్యక్తులను దొడ్డిదారిన నియమించేందుకు చేస్తున్న ప్రయత్నాలు మంచి కావన్నారు. ఆర్టీసీ డ్రైవర్ల ద్వారానే ఎలక్ట్రిక్ బస్సులను నడపకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు-2 డిపో సీనియర్ నాయకులు ఖాన్, రామకృష్ణారెడ్డి, దేవరాజు, కర్నూలు-1 డిపో నాయకులు నాగరాజు, హనుమంతరెడ్డి, జానకీ, రాముడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్-(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్/ జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి జేసీ డాక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. సీఎంఓ గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద - 7, కర్నూలు ఆర్‌డీఓ వద్ద 4, పత్తికొండ ఆర్‌డీఓ వద్ద 3, కలెక్టరేట్ ఏఓ వద్ద 3, సర్వే ఏడీ, విద్యాశాఖ, పశుసంవర్ధక శాఖ, డీఆర్‌డీఏ పీడీల వద్ద ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

- కర్నూలు మార్కెట్ యార్డులో తక్షణమే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఓర్వకల్ మండలంలో రైతులు పండించిన పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయకపోవంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.
- జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.విద్యాసాగర్, డి.చంద్రమోహన్ వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు విద్యారాయితీ ఇస్తున్నారని, కర్నూలు జిల్లాలోనూ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- కృష్ణగిరి మండలం మాదాపురం గ్రామంలోని సర్వే నంబర్ 759/ఏ1లో మాదిగలకు కేటాయించిన 43.23 ఎకరాలను రెవెన్యూ అధికారులు పారిశ్రామిక వేత్తకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని తహసీల్దార్, పత్తికొండ ఆర్‌డీఓలను కోరినా పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొందిమడుగుల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.
- కల్లూరు మండలం అశ్వత్థపురంలోని పరిశ్రమ నుంచి మసి, బూడిద తమ కాలనీల్లోకి వస్తోందని, దాని వల్ల కంటిచూపు మందగించడం, ఊపిరితిత్తుల వ్యాధులతో పిల్లలు, వృద్ధులు బాధపడుతున్నారని బాలాజీ విల్లాస్, వెంగన్నబావి, దిన్నెదేరపాడు గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.
- గత ప్రభుత్వ హయాంలో పత్తికొండ మండలం జూటూరు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని సివిల్ సప్‌లై గోదాముకు కేటాయించారని, అయితే ఆ స్థలాన్ని కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయిస్తోందని, ఇది మంచి పద్ధతి కాదని, దీన్ని తమ గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇళ్ల పట్టాలుగా ఇవ్వాలని ఆర్.మండగిరి ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.

అతిసార వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): అతిసార వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. సోమవారం కర్నూలు నగరంలోని శ్రీరామనగర్ పరిధిలోని 59వ సచివాలయంలో నిర్వహిస్తున్న డయేరియా నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 16 నుంచి జులై 31వ తేదీ వరకు జిల్లా అంతటా డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు డయేరియా కూడా ఒక ముఖ్యకారణమని, కావున ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల వాడకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు పద్మావతమ్మ, రామలక్ష్మి, ఆశా కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.

28న రగ్బీ చాంపియన్‌షిప్

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి రగ్బీ జూనియర్ బాలబాలికల విభాగంలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 7, 8 తేదీల్లో డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

28 నుంచి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్

కర్నూలు (టౌన్): గుజరాత్ రాష్ట్రంలోని బుజ్జి పట్టణంలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు 54వ జాతీయస్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మే నెల 3, 4 తేదీల్లో నరసరావుపేట, మార్కాపురంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జాతీయ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ

ఓర్వకల్లు: ఒలింపిక్ డే రన్‌ను పురస్కరించుకొని ఈ నెల 18, 19, 20 తేదీలలో కర్నూలులో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీలలో మండలంలోని కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ఎస్ఓ రాజేశ్వరమ్మ తెలిపారు. ఇందులో భాగంగా అంతర్ జిల్లా కబడ్డీ, షూటింగ్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రథమ బహుమతి, సెపతక్రాలో ద్వితీయ బహుమతి, చెస్, క్యారమ్, యోగా పోటీలలో ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. వీరికి సోమవారం ఒలంపిక్ డే రన్ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఈ ప్రభాకర్ చేతుల మీదుగా బహుమతులను అందజేసినట్లు చెప్పారు.

పాఠశాలను యథాతథంగా కొనసాగించాలి



ఎంఈఓతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

కల్లూరు: కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, గట్టయ్య నగర్‌లో ఉన్న ఎంపీపీ పాఠశాలను యథాతథంగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మండల నాయకులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులును సీఐటీయూ నాయకులు, విద్యార్థుల తల్లిండ్రులు కలిసి వినతి పత్రం అందించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గట్టయ్య నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదవ తరగతుల విద్యార్థులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న కస్తూరి నగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు తరలించడాన్ని ఎంఈఓ తక్షణమే రద్దు చేయాలన్నారు. ఒకపాఠశాల విద్యార్థులను మరొక పాఠశాలకు తరలించకూడదని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా కొంతమంది ఒత్తిడి మేరకు ఎంఈఓ సంతకాలు పెట్టించారని, తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరగలేదని చెప్పారు. తప్పుడు తీర్మానం చేసిన వారిని విచారణ చేసి యథాతథంగా పాఠశాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఉమా వెంకటలక్ష్మి, కవిత, భారతి, మహేశ్వరి, కావ్య, శ్రీలత, సీఐటీ యూ నాయకులు యేసు తదితరులు పాల్గొన్నారు.

'పబ్బం గడుపుకునేందుకే పవన్ ప్రేలాపనలు'

కర్నూలు కల్చరల్: భావ ప్రకటన స్వేచ్ఛపై పవన్ కల్యాణ్ చేస్తున్న దాడిని ఖండించాల్సిన అవసరం ఉందని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి నాగభూషణం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తమిళనాడులోని మధురైలో హిందూ మున్నాని ఆర్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మురుగన్ భక్తుల మహానాడులో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పవన్‌కల్యాణ్ గతంలో చేగువేరా, భగత్‌సింగ్ తన రోల్ మోడల్ అంటూ యువతను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారని, ఇప్పుడేమో రాజకీయ పదవుల కోసం సనాతన ధర్మం, హిందూ ధర్మం అంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పవన్ స్వార్థ రాజకీయాలను మేధావులు, అభ్యుదయవాదులు అందరూ ఖండించాలన్నారు. సనాతన ధర్మం, హిందూ మతం గురించి ఎంతైనా పొగుడుకోవచ్చని, సమాజ మార్పు కోసం పరితపిస్తున్న హేతువాదులు, నాస్తికవాదులు, అభ్యుదయ కార్మిక శక్తుల జోలికి రావొద్దని హెచ్చరించారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన



సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కల్లూరు: ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఓబుళాపురంతండాలో సికిల్ సెల్ వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జన్యుపరమైన సమస్యలతో వంశపారంపర్యంగా సంభవించే రక్తహీనతే సికిల్ సెల్ అన్నారు. ఈ వ్యాధి కారణంగా రక్తహీనత, కామెర్లు, కీళ్లనొప్పులు, కాలేయ సమస్యలు, మూత్రపిండాలు, పిత్తాషయంలో రాళ్లు, పక్షవాతం, ఛాతీ సమస్య, ఆయాసం, కడుపు నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కొన్ని సందర్భాల్లో రక్తహీనత సమస్య పెరిగి చివరికి ప్రాణాలు పోయే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సిగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైన వారికి ఉద్యోగావకాశాలు

కర్నూలు (హాస్పిటల్): ఇంటర్ ఫెయిలైనవారికి జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ/డిప్లొమా పారా మెడికల్/ నర్సింగ్/బీపీడీ కోర్సులలో ప్రవేశం నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు స్థానిక జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లో ఉన్న బొల్లినేని మెడి స్కిల్స్ 86865 94534, 76809 45357 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.